# తీర్పు

వీరపల్లె వీణావాణి

పగలంతా ఆకాశంలో నిప్పులు చిమ్మిన సూర్యుడు పడమటి కొండల్లోకి జారిపోయి చాలా సేపయ్యింది.

ముదురు చీకట్లు ముసురుకొంటున్నాయి.

పొలం పనులు ముగించుకున్న రైతులంతా మడక, కాడిమాన్లను భుజాలమీద పెట్టుకొని ఇళ్ళకు తిరుగుముఖం పడుతున్నారు. నేలమీద పచ్చని పట్టుచీరలు ఆరేసినట్లుగా ఏపుగా పెరిగిన వరి పైరు సాయంత్రపు గాలికి తెపరెపమంటూ సవ్వడి చేస్తోంది

తలమీద కట్టెల మోపును మోసుకొంటూ....పొలం గట్ల మధ్యగా నడిచి వస్తున్న నీలి....పొలాలను దాటుకొని.... అక్కడే ఉన్న ఏట్లోకి దిగింది. ఆ ఏట్లో నీళ్ళు పారడంలేదు.

ఆ ఏట్లోని యిసుక తిన్నెలు వెండి కుప్పల్లా ఉన్నాయి. తలమీది కట్టెల మోపును ఆ యిసుక తిన్నెలమీద పడేసి.... ఉసూరుమంటూ ముఖానికి పట్టిన చెమటను చెంగుతో తుడుచుకొంది నీలి. ఆ ఏట్లో మనుషులెవ్వరూ కన్పించటం లేదు.

ఆ ఊరి చాకలివాళ్ళు బట్టలు ఉతకడానికి నీళ్ళకోసం ఆ ఏట్లో త్రవ్విన 'కపిం' దగ్గరి కెళ్ళి....ముఖమూ కాళ్ళూ చేతులూ శుభ్రంగా కడుక్కొని....అల్లంత దూరాన వస్తున్న తన మావకోసం ఎదురు చూస్తూ యిసుక తిన్నెమీద చతికిలబడింది నీలి.

"యెవురా దుండేది?"—ఒకమగగొంతు.

చటుక్కున తలతిప్పి చూసింది నీలి.

అక్కడ ...ఏటిగట్టు వారుండే కానగ చెట్ల గుబురులలోంచి చెంగల్ రెడ్డి సేద్యగాడు సుబ్బిగాడు తూలుతూ నడిచి వస్తున్నాడు. అతడి పిలుపుకు బదులు పలకలేదు నీలి.

యిసుక తిన్నెలమీద కాళ్ళీడ్చుకొంటూ వస్తున్న సుబ్బిగాడి నడక తీరు చూస్తుంటే వాడు బాగా తాగి వస్తున్నాడని తెలుసుకోడానికి ఎంతో సేపు పట్టలేదు నీలికి.

సుబ్బిగ్గాడు మాదిగ గంగన్న రెండో కొడుకు. ఆఊరి మోతుబరి రైతైన చెంగల్ రెడ్డి యింట్లో.... సుమారు నాలుగేళ్ళనుండి పాలేరుగా పనిచేస్తున్నాడు సుబ్బిగాడు.

వొళ్ళు దాచుకోకుండా కష్టపడి పని చేస్తాడని. కాలితో చెయ్యమని చెప్పిన పనిని చేత్తో చేసిపెడతాడని ఈ సుబ్బిగాడి మీద చెంగల్ రెడ్డికి ప్రత్యేకమైన అభిమానముంది.

నాలుగేళ్ళ నుంచి పాలేరుగా కష్టపడి పని చేస్తున్నా సుబ్బిగాడు కానీ. వాళ్ళ నాన్న కానీ. ఏనాడూ చెంగల్ రెడ్డిని తమ జీతం పెంచమని అడగలేదు. అడిగే ధైర్యం వాళ్ళకులేదు. వాళ్ళు అడక్కపోయినా జీతం పెంచే ఉదార స్వభావం చెంగల్ రెడ్డికిలేదు.

సుబ్బిగాడికి తాగుడు అలవాటుఎక్కువ.

దానికితోడు ఆడవాళ్ళ పిచ్చికూడా ఉంది.

ఆమధ్య.... చింతల తోపులో మాల నర్సన్న కూతుర్ని పట్టుకుని సుబ్బిగాడు బలవంతం చేసినందుకు మాదిగపల్లె. మాల పల్లెల మధ్య పెద్ద గొడవలు జరిగాయి. చెంగల్ రెడ్డి యింకా ఆ ఊరి రైతులు కొందరు ఆ గొడవలను అణిచేశారు.

"ఏయ్! పిలస్తావుంటే యినిపించలా? మూగి ముండలా కుచ్చున్నావేం?"—అన్నాడు సుబ్బిగాడు నీలి దగ్గర కొచ్చి.

సారాయి వాసన గుప్పుమని వచ్చింది నీలికి.

మనసులోనే సుబ్బిగాన్ని చీదరించుకొంది నీలి

"వొసే వుంపడం ముండా? కండ్లల్లో కనికిడేసి కొవ్వు పట్టిందే నీకు. నీయబ్బ గంటు పొయ్యినట్టు పిలస్తావుంటే పెవుల్లో దూరనట్టు గొమ్ముమంటా వేంద లంజిముండా...." - అంటూ సుబ్బిగాడు. నీలిని బండ బూతులు తిట్టడం మొదలెట్టాడు.

నీలికి ఒళ్ళు మండిపోయింది.

పైగా సుబ్బిగాడంటే నీలికి మొదటి నుంచి పట్టదు. తన జోలికి వస్తే సుబ్బిగాడికి బాగా బుద్ధి చెప్పాలని .... అప్పుడప్పుడూ అనుకొనేది నీలి.

"పోరా జాడు నాబట్టా! దగ్గిరికొచ్చి తాగుబోతు కూతలు కూసినావంటే. కాలం చెడిపొయ్యేటట్టు మోటు పొరకతో కొడ్తాను—"అంది నీలి యిసుక తిన్నె మీది నుంచి పైకి లేచి నిలబడి.

"యేందే....యేంది నువ్వు అనింది? మోటు పొరకతో....నన్ను....నీయమ్మా.. యాన్నించొస్తాయే నీకి తక్కువ మాటలు? మొగోడని యెంచకుండా నన్ను బిగి కాట మాటలంటావా?" అంటూ సుబ్బిగాడు ఒక్క ఉదుటున నీలి మీదికి దూకి....పైట పట్టుకొని బలంగా గుంజాడు.

నీలి యిసుకపై బోర్లా పడిపోయింది.

యింతలో నీలిమావ వెంకట్రాముడు పరుగుతో వచ్చి సుబ్బిగాన్ని బలంగా ఒక్క తన్ను తన్నాడు. ఆ దెబ్బతో సుబ్బిగాడు విసురుకపోయి దూరంగా పడ్డాడు.

"ఆడదాన్ని సూస్తే వొళ్లు మరిసిపోతావురా తాగుబోతు నా కొడకా"—అంటూ వెంకట్రాముడు సుబ్బిగాడిపైపడి చావ గొట్టసాగాడు.

"తాగుబోతు వోగుతో మనకేం పని. పదాం రా మావా"— అంటూ నీలి తన మావను దూరంగా లాగేసింది.

అరగంటకల్లా....

తన పెళ్ళాం జోలికి వచ్చినందుకు ఏట్లో మాల వెంకట్రాముడు మాదిగ

సుబ్బిగాడిని చావగొట్టాడనే వార్త తీగలా ఊరంతా అల్లుకపోయింది. తన పాలేరును వెంట్రాముడు కొట్టాడని తెలియగానే చెంగల్ రెడ్డి కోపంతో ఊగిపోయాడు.

"మనూరు మాలోల్లు మిడిమేలం నాయాండ్లయి పోతావుండారు. మనం గొమ్మనుండిపోతే యీ పొద్దు సుబ్బిగాన్ని సావగొట్టినోల్లు రేపు మనమింది కొచ్చినా వొస్తారు"—అన్నాడు మునసబు.

"సెంగల్రెడ్డీ. నీ సేద్దిగోన్ని ఆ యంకట్రాముడు కొట్టినాడంటే నీకే బగిశాట్లు. అయినా వోనికి యెంత దగిర్నం? ఆ మాల యంకట్రామునికి రయితులంటే లెక్క లేకుండా వుంది" — కరణం అన్నాడు.

చెంగల్ రెడ్డి రెండు నిముషాలు ఏం మాట్లాడలేదు.

"మాల నాయాండ్లకు గొడ్డు కూర తివి బాగా కొవ్వెక్కిపోయింది. అందుకే ఆ నా కొడకలకు కన్నూ మిన్నూ కనిపించకుండాపోతా వుంది. యంకట్రామున్ని వొదిలేది లేదు. రేపు రేతిరికి గుడి దెగ్గిర పంచాయతి పెట్టించి వోనికాడ నుంచి మాట్రూపాయలు తప్పు వొసూలు పెయ్యాల" — అన్నాడు పళ్ళు కొరుకుతూ చెంగల్ రెడ్డి.

చెంగల్ రెడ్డికి ఈ మధ్య మాలవాళ్ళ మీద గొంతువరకు కోపం వుంది. ఎందుకంటే పాత కూలీయిస్తే తమకు గిట్టుబాటు కాదని కూలి పెంచాలని మాలవాళ్లు పదిరోజుల ముందు చెంగల్ రెడ్డి దగ్గర కొచ్చి తమ కష్టాలను ఏకరువుపెట్టుకొన్నారు.

కానీ చెంగల్ రెడ్డి కూలి పెంచనన్నాడు.

మాలవాళ్ళు చాలాసేపు చెంగల్ రెడ్డిని అడుక్కున్నారు. ప్రాధేయపడ్డారు అయినా లాభం లేకపోయింది.

"కూలి పెంచకుంటే పనుల్లోకి రావడం మానేయాల్సి వుంటుంది సామీ!"— అని ఆఖరున అన్నాడు వెంకట్రాముడు.

మిగిలిన వాళ్ళంతా వెంకట్రామునికి వంత పాట పాడారు. చెంగల్ రెడ్డి కోపంతో ఊగిపోయాడు. కూలి పెంచలేదు. మెల్లగా మాలవాళ్ళు సేద్యం పనులకు రావడం మానుకొన్నారు.

అందుకే. చెంగల్ రెడ్డికి....

ఆ ఊరి మాలవాళ్ళ మీద ముఖ్యంగా వాళ్ళకు నాయకత్వం వహించే వెంకట్రాముడి మీద టోలెడంత అక్కసుంది.

ఆ మరుసటి రోజు....

రాత్రి పది గంటలు దాటుతోంది. ఆ ఊరి రాములు గుడిముందు యింటి కొక్కరు చొప్పున రైతులంతా పంచాయితీ చేరారు. గుడి ముందు. ఎడం వైపు మాదిగోళ్ళు. కుడివైపు మాలోళ్ళూ చేతులు కట్టుకొని వినయంగా నిలబడి ఉన్నారు.




ఆ పంచాయితీలో....

వెంకట్రాముడిది తప్పని తేలుస్తారో లేక సుబ్బిగాడిది తప్పని తేలుస్తారో చూద్దామని పీధి తిన్నెల మీద కూర్చొని ఆసక్తిగా చూస్తున్నారు ఆ ఊరి అమ్మలక్కలు. పసిపిల్లలు మాత్రం యిదేం పట్టనట్టు పొలిమేర దగ్గర వెన్నెల కుప్పలాడుకొంటున్నారు.

"యేరా సుబ్బిగా. నిన్న మాయిటేల నీకని బూతులు తిట్టి....నువ్వు దానికొంగు పట్టి గుంజింది నిజమేనా?"—అడిగాడు కరణం.

"నిజమే సామీ"—రైతుల ముందు కొచ్చి నిలబడి చేతులు కట్టుకొని వినయంగా బదులు చెప్పాడు సుబ్బిగాడు.

"యదవ నాయాలా. గానిగెద్దు మాదిరిగా వుండావుగదరా. సిగ్గూ సీమూ వుండే వోడెవడన్నా యిట్టాంటి పనిజేస్తాడా?

యెవుడికన్నా తెలిస్తే మొకం మింద వూంచతారని తెలవదా నీకు?—" అంటూ చెంగల్‌రెడ్డి సుబ్బిగాడిని తిట్టసాగాడు.

"యాల జేసినావురా యీ పని?"— మునసబు ప్రశ్న.


"యేమో సామీ! నిన్న మాయిటేల సింపిరన్న అంగిట్లో రొండు రూపాయల సారాయి తాగి యేట్లోకి దిగబడి వొచ్చినా. యేట్లో.... సాకలోల్ల కసింకాడ యెవురో మనిసున్నట్టు కనబడితే యేందో తాగిన మయికంలో తప్పుడు కూతలుగూసి కొంగు పట్టుకోని గుంజినా. తాగినోడికి మనుసులెవురో సరిగ్గా తెలవదు గదసామీ? ఆడున్నంది నీలి అని తెలిసుంటే నేను మాత్తరం దాని జోలికి యాలబోతాను సామీ?" అంటూ సుబ్బిగాడు జరిగిన విషయాన్ని వివరంగా చెప్పాడు.

రెండు క్షణాలు మౌనంగా దొర్లిపోయాయి.

"సరే.... తాగిన మయికంలో మనిసెవురో తెలవక సుబ్బిగాడు యేందో సేసినాడే అనుకో. అంత మాత్రానికే యంకట్రాముడు యంటనే సుబ్బిగాన్ని కొట్టకుంటేయేం? జరిగిన యిసయం మునకాడికి వొచ్చి సెప్పుంటే మనమే సుబ్బిగాన్ని దండించే వోళ్ళం గదా. ఈ ఊరికి పెద్ద మనుసులుండారు గదా. వోళ్ళతో సెప్పకుండా యంకట్రాముడు యింత పని జెయ్యడం న్యాయంగాదు" అన్నాడు మునసబు.

"అదేంది సామీ, తమరు కూడా అట్టాగే మాట్లాడతావుండారు. రొండు రూపాయల సారాయి తాగితే మాత్తరం— యెదురుగా వుండే మనిసెవురో గురుతు పట్టలేనంత మయికం వొచ్చేస్తాదా? సుబ్బిగాడు కావాలనే నా పెండ్లాం కొంగు పట్టుకొన్నాడు. వోడికి బాగా తెలుసు అది నా పెండ్లామని" చెప్పాడు వెంకట్రాముడు.

## భక్తులు



గుడిలో కెళ్ళిన కొందరు
మనసులు వీధిలో వదిలిన
చెప్పులపైన
చెవులు పక్కవారి మాటలపైన,
పురుషులు చూపులు స్త్రీలపైన.
స్త్రీలు ప్రక్కవారి నగలు చీరెలపైన
లగ్నం చేస్తారు
మరి అక్కడ భక్తికి చోటేది?

—పంతుల సుబ్బారావు

"పెమానంగా సెప్తావుండాను. ఆ మయికంలో నాకు మనిసెవురో తెలవక యీ యదవ పని జేసినాను గానీ ఆడున్నంది నీలి అని తెలిసుంటే దేవుని సాచ్చిగా దాని దెగ్గిరి కూడా యెల్లేవోన్ని కాదు"— అన్నాడు సుబ్బిగాడు.

రెండు నిముషాలు మళ్ళీ నిశ్శబ్దం.
ఎవరూ ఏమీ మాట్లాడడం లేదు.

"యేం సెంగల్రెడ్డి. అందరూ అట్టా గమ్మున వుండిపోతే యట్టా? శానా రేతిరి అయిపోతా వుంది. యెవురిది తప్పో తేల్చేయండి—" అన్నాడు మునసబు.

"నేను మాట్లాడడం బాగుండదు. యాలంటే సుబ్బిగాడు నా సేద్దిగాడు. అందుకని నేను యేదన్నా మాట్లాడినానంటే వాలవచ్చికంతో సుబ్బిగాని పక్క మాట్లాడినానని అందరూ అనుకొంటారు. అందుకే మీరే మాట్లాడి తప్పు యెవురిదో తేల్చేయండి. అయితే యెవురిది తప్పని తేల్తాందో వోళ్ళు నూర్రూపాయలు కట్టాల—" అన్నాడు చెంగల్ రెడ్డి.

"యేరా సుబ్బిగా? యంకట్రామా? ఇప్పుడు మీరు సెంగల్రెడ్డి సెప్పింది ఇన్నారు గదా. ఈడ సేరిన పెద్దలు మీ ఇద్దర్లో తప్పు యెవురిదో తేల్చేస్తారు. తీరుపు ఇచ్చేసినాక నూర్రూపాయలు మీలో యెవురో ఒకరు కట్టాల. అందుకు మీకిద్దరికీ సమ్మతమేనా?" చొక్కా జేబులోంచి బీడీ కట్టను బయటకు తీస్తూ అడిగాడు మునసబు.

"నాకు సమ్మతమే సామీ!" అన్నాడు సుబ్బిగాడు.

వెంకట్రాముడు కూడా తల ఆడించాడు.

కాసేపు తర్జన భర్జనలు జరిగాయి కరణం చెప్పిన తీర్పుకు ఆ ఊళ్ళో ఎప్పుడూ ఎదురుండదు. అందుకే కరణాన్నే తీర్పు చెప్పమని అక్కడున్న అందరూ బలవంతం చేశారు.

"జరిగిన దాంట్లో సుబ్బిగాడిది తప్పు లేదనలు. యాలంటే తాగినోడు సోదీనంలో వుండడు. వోడు యేం మాట్లాడతాదో వోడికే తెలవదు. మయికంలో యెదురుగా వుండే మనుసుల్ని గూడా గురుతుపట్టడు. వొక్క సుబ్బిగాడే గాదు. తాగితే యెవురైనా అంతే. కాబట్టి సుబ్బిగాడు నీలి అని తెలియక మయికంలో నీలిని బూతులు తిట్టి దాని కొంగు లాగినాడు. యిది కావాలని సేసిన పనిగాదు. అయితే జరిగిన సంగతి పెద్దలకు సెప్పకుండా సుబ్బిగాన్ని పట్టుకొని యంకట్రాముడు కొట్టడం పెద్ద తప్పు. అందుకే యంకట్రాముడు తప్పుగా నూర్రూపాయలు కట్టాల"— తీర్పు ఇచ్చేశాడు కరణం.

మాదిగోళ్ళు ఆనందపడిపోయారు. మాలోళ్ళ మనసులు ఆ తీర్పు విని కుతకుతలాడిపోయాయి. వెంకట్రాముడు ఆ తీర్పు విని శిలాప్రతిమలా నిలబడిపోయాడు. యీ దెబ్బతో నాయాలికి కొవ్వు అనిగిపోవాల— అనుకొంటూ మురిసిపోయాడు చెంగల్‌రెడ్డి.

"సరే సాములూ! తప్పు నా మొగుడిదే. నూర్రూపాయలు తప్పుగా రేపు యిచ్చేతాం. అయితే సిన్నమాట. తాగిన మయికంలో నేను యెవురో తెలవక సుబ్బిగాడు నా జోలికి వొచ్చినాడు. తాగితే సోదినం వుండదుగదా. రేపు సుబ్బిగాన్ని రొండు రూపాయల సారాయి తాగి యింట్లోకెళ్ళి వాళ్ళ సెల్లిని చూసి పెండ్లామే అనుకొని కొంగు పట్టుకొని పడకపైకి యీడ్చుకొని పొమ్మని సెప్పండి. మయికంలో వోడు ఆ పని జేసినాక నూర్రూపాయలు తప్పుగా కట్టతాం"— అంది నీలి. అంతే నీలి మాటలు విని నివ్వెరపోయారందరూ.

